10 YEAR ANNIVERSARY 2014 - 2024

# పెన్ పవర్

తెలంగాణ రౌండప్

శనివారం 14 సెప్టెంబర్ 2024 పేజీలు 8





గణేష్ నవరాత్రులు సందర్భంగా కుంకుమార్చన కుత్బుల్లాపూర్ సర్కిల్ ఎస్సార్ నాయక్ నగర్ జనప్రియ సాయినెస్ట్ లో ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రోత్సవాలలో భాగంగా శుక్రవారం కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా అపార్ట్మెంట్ ఏ, బి బ్లాకులకు చెందిన కమిటి సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గణేషునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు..

పెన్ పవర్ న్యూస్, జీడిమెట్ల, సెప్టెంబర్ 13:

# ప్రాంతీయవాదాన్ని తెరపైకి తీసుకువస్తారా?

## దానం నాగేందర్ ఆగ్రహం



- కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలు పార్టీ వైఖరా? లేక వ్యక్తిగతమా? అని నిలదీత
- ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో చిచ్చు పెడుతున్నారని మండిపాటు
- కౌశిక్ రెడ్డి కెపాసిటీ ఎంతో తెలుసునని చురక


**హైదరాబాద్ పెన్ పవర్:**బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రాంతీయ వాదాన్ని తెరపైకి తీసుకువస్తున్నారని ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన చేసిన వ్యాఖ్యలు పార్టీ వైఖరా? లేక వ్యక్తిగతమా? చెప్పాలని నిలదీశారు. ఈ అంశంపై బీఆర్ఎస్ పార్టీ అధిష్ఠానం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. దానం నాగేందర్ ఇవాళ అరికెపూడి గాంధీ నివాసానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో చిచ్చు పెట్టవద్దని సూచించారు.అరికెపూడి గాంధీ నివాసంలో బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశం పేరిట బద్నాం చేసే ప్రయత్నం జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌశిక్ రెడ్డి కెపాసిటీ ఎంతో తమకు తెలుసునని ఎద్దేవా చేశారు. తాము అన్నీ చేసే ఇక్కడి వరకు వచ్చామని వ్యాఖ్యానించారు.

ప్రాంతీయ వాదాన్ని తెరపైకి తీసుకురావడం ఏమిటని ప్రశ్నించారు. కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలు వ్యక్తిగతమైతే బీఆర్ఎస్ ఆయనను సస్పెండ్ చేయాలని దానం నాగేందర్ డిమాండ్ చేశారు. పార్టీ విస్తృతస్థాయి సమావేశం ఎక్కడైనా ఇంట్లో చేస్తారా? అని నిలదీశారు. అసలు అవగాహన ఉండే మాట్లాడుతున్నారా? అని ప్రశ్నించారు.

# సీఎం రేవంత్ రెడ్డిని కలిసి బాలకృష్ణ తరఫున విరాళం అందించిన చిన్న కుమార్తె తేజస్విని

- ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో వరదలు
- కోటి రూపాయల విరాళం ప్రకటించిన బాలకృష్ణ
- మొన్న ఏపీ సీఎం చంద్రబాబును కలిసి రూ.50 లక్షల చెక్ అందజేసిన బాలయ్య





**హైదరాబాద్ పెన్ పవర్:**టాలీవుడ్ అగ్ర కథానాయకుడు, హిందూపురం టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఇటీవల తెలుగు రాష్ట్రాలను వరదలు కుదిపేసిన నేపథ్యంలో, రెండు రాష్ట్రాలకు కోటి రూపాయల విరాళం ప్రకటించారు. నిన్ననే బాలకృష్ణ అమరావతి వచ్చి సీఎం చంద్రబాబుకు రూ.50 లక్షల చెక్ అందజేశారు. ఈ క్రమంలో, బాలకృష్ణ చిన్న కుమార్తె తేజస్విని నేడు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. తన తండ్రి బాలకృష్ణ తరఫున రూ.50 లక్షల చెక్ ను సీఎం రేవంత్ రెడ్డికి అందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా పాల్గొన్నారు.

-2 లో

# హైడ్రాను రద్దు చేయాలని హైకోర్టులో పిటిషన్ ప్రభుత్వానికి హైకోర్టు కీలక ఆదేశాలు



హైదరాబాద్‌తోపాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో చెరువులు, నాళాలు అక్రమించిన కబ్జాదారుల్లో హైడ్రా దడ పుట్టిస్తుంది. గత రెండు నెలలుగా హైడ్రా వార్తలు బాగా వినిపిస్తున్నాయి. పలు అక్రమ కట్టడాలను కూల్చివేసి దాదాపు 111 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుంది హైడ్రా.. బఫర్, ఎఫ్టీఎల్ పరిధిలో ఉంటే చాలు కూల్చివేతలే. ఈ క్రమంలో హైడ్రాను రద్దు చేశాలని ఓ మహిళ హైకోర్టులో పిటీషన్ వేసింది.

-2 లో

# డీజీపీ, పోలీస్ ఉన్నతాధికారులకు హరీశ్ రావు సూచన



**హైదరాబాద్ పెన్ పవర్:** ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి మాటలను గుడ్డిగా అనుసరిం చవద్దని డీజీపీ, పోలీసు ఉన్నతాధికారులకు బీఆర్ ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు సూచించారు. కోకాపేటలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... డీజీపీ అనేది అత్యున్నత స్థాయి, గౌరవప్రదమైన పోస్టు

- డీజీపీ బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్న హరీశ్ రావు
- గతంలో రేవంత్ రెడ్డిని అరెస్ట్ చేయడానికి వెళితే పోలీసులను తిట్టారని ఆరోపణ
- తప్పు చేయాలని రేవంత్ రెడ్డి చెప్పినా చట్టబద్ధంగా వ్యవహరించాలని హితవు

# సీతారామ్ ఏచూరి మరణం.. వామపక్షాలకు తీరని లోటు..

## సిపిఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్..

## షాపూర్ నగర్‌లో ఏచూరికి నివాళులు అర్పించిన కామ్రేడ్స్..





**కుత్బుల్లాపూర్, పెన్ పవర్,సెప్టెంబర్ 13:** విప్లవ మేధావి కమ్యూనిస్టు యోధుడు సీతారాం ఏచూరి మరణం వామపక్ష ఉద్యమానికి దేశానికి తీరని లోటు, అని కుత్బుల్లాపూర్ సిపిఎం మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ పేర్కొన్నారు.. సిపిఎం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి సంతాపంగా షాపూర్ నగర్ సిపిఎం కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు.. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ మాట్లాడుతూహొ భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) అఖిలభారత ప్రధాన కార్యదర్శి, కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం దేశ ప్రజా ఉద్యమాలకు, వామపక్ష ఉద్యమానికి తీరని లోటు అని, అన్నారు ఎమర్జెన్సీ టైంలో ఇందిరాగాంధీని వైస్ ఛాన్సలర్‌గా ఉండొద్దని విద్యార్థినేతగా ప్రశ్నించిన యోధుడు సీతారామ్ ఏచూరి అని కొనియాడారు.. ఎస్ఎఫ్ఐ, సిపిఎం జాతీయ రాజకీయాల్లో దేశ సంకీర్ణ ప్రభుత్వాల ఏర్పాటుకు బీజం వేసిన నాయకులు కామ్రేడ్ సీతారాం ఏచూరి అని అన్నారు.. దేశ ప్రజలను సంఘటితం చేస్తూ ఉపాధి హామీ చట్టం తీసుకొచ్చి కార్మిక వర్గాలల్లో వెలుగు నింపిన మహోన్నత వ్యక్తి ఏచూరి అని పొగిడారు.. సీతారాం ఏచూరి మరణం వామపక్ష ఉద్యమాలకు ప్రధానంగా సిపిఎం పార్టీకి ప్రజా ఉద్యమాలకు తీరనిలోటని అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు ఈ దేవదానం, ఆర్ స్వాతి, కె. శ్రీనివాస్. టీవీఎస్ రమణ జి. వెంకన్న సైదులు. మైసయ్య మల్లారెడ్డి. శ్రీశైలం బాషా. కరుణాకర్ యాదవ రెడ్డి . పార్టీహొ సానుభూతిపరులు పార్టీ కార్యకర్తలు పాల్గొని నివాళులర్పించారు.



## హైడ్రాను రద్దు చేయాలని హైకోర్టులో పిటిషన్ ప్రభుత్వానికి హైకోర్టు కీలక ఆదేశాలు

- మొదటి పేజి తరువాయి

లక్ష్మీ అనే మహిళ వేసిన పిటీషన్ ను హైకోర్టు విచారించింది. హైడ్రా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 99ను రద్దు చేయాలని పిటీషనర్ కోరింది. ఈ పిటీషన్ పై కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది.
హైడ్రా ఏర్పాటు నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని పిటీషనర్ తరపు న్యాయవాది వాదించారు. జిహెచ్ఎంసి యాక్ట్ ప్రకారం.. జిహెచ్ఎంసి కి ఉన్న అధికారులను మరొక అథారిటీకి ఇవ్వకూడదని కోర్టులో వాదించారు. జిహెచ్ఎంసికి ఉన్న అధికారులను హైడ్రాకు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. జీవో 99 ప్రకారం హైడ్రాకు ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారి లేదా ప్రభుత్వ కార్యదర్శి అధికారిగా ఉండాలని పిటీషన్ లో పేర్కొన్నారు. కానీ ప్రస్తుతం హైడ్రాను ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారి కాకుండా ఉన్న వ్యక్తిని నియమించారని కోర్టుకు తెలిపారు. తదుపరి విచారణను హైకోర్టు రెండు వారాలకు వాయిదా వేసింది.

## డీజీపీ, పోలీస్ ఉన్నతాధికారులకు హరీశ్ రావు సూచన

- మొదటి పేజి తరువాయి

అని, ఈ పదవిలో ఉన్నప్పుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. రేవంత్ రెడ్డి గురించి తెలిసిందేనని... గతంలో ఆయనను హౌస్ అరెస్ట్ చేయడానికి వెళితే పోలీసులను తిట్టారని ఆరోపించారు.
ఆ వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో కూడా వైరల్‌గా మారాయని పేర్కొన్నారు. కానీ బీఆర్ఎస్ నేతలు మాత్రం పోలీసులకు సహకరిస్తున్నారని తెలిపారు. కాబట్టి రేవంత్ రెడ్డి మాటలను అనుసరించవద్దని కోరారు. తప్పు చేయాలని రేవంత్ చెప్పినా చట్టబద్ధంగా వ్యవహరించాలని హితవు పలికారు. నిన్న అరికెపూడి గాంధీని ఆపకుండా... ఈ రోజు తమను ఆపడం ఏమిటని ప్రశ్నించారు. కౌశిక్ రెడ్డి ఇంటికి పంపించి దాడి చేయించినప్పుడు లా అండ్ ఆర్డర్ ఏమైందో చెప్పాలన్నారు.రేవంత్ రెడ్డి విసిరే ప్రతి రాయి తమకు పునాదిరాయిగా మారుతుందన్నారు. రాళ్ల దాడులకు భయపడతామని అనుకుంటే పొరపాటు అన్నారు. పోరాటాలు తమకు కొత్తేమీ కాదన్నారు. తెలంగాణ గురించి బాధ్యతగా ఆలోచిస్తామన్నారు.
పార్టీ ఫిరాయింపుల విషయంలో హైకోర్టు మొట్టికాయలు వేసిందని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి అన్నీ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. ఒక సమస్య నుంచి తప్పించుకోవడానికి మరో సమస్యను సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పార్టీకి రాజకీయం కంటే రాష్ట్రం ముఖ్యమన్నారు.

# నాపై కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు కేసీఆర్ సమాధానం చెప్పాలి: అరెకపూడి గాంధీ

- కౌశిక్ రెడ్డి మాదిరే తాను కూడా బతకడానికి హైదరాబాద్ కు వచ్చానన్న గాంధీ
- కౌశిక్ రెడ్డి చీటర్, బ్రోకర్ అంటూ తీవ్ర వ్యాఖ్యలు
- బీఆర్ఎస్ చెప్పిన వాళ్లకే పీఏసీ పదవి ఇవ్వాలనేం లేదని వ్యాఖ్య



**హైదరాబాద్ పెన్ పవర్:**తనను ఆంధ్రోడన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలకు కేసీఆర్ సమాధానం చెప్పాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ డిమాండ్ చేశారు. కౌశిక్ రెడ్డి బతకడానికి హైదరాబాద్ కు వచ్చినట్టే తాను కూడా హైదరాబాద్ కు వచ్చానని ఆయన చెప్పారు. ఎంతో మందిని చీటింగ్ చేసిన కౌశిక్ రెడ్డితో తనకు పోలికేంటని ఎద్దేవా చేశారు. తనను బీఆర్ఎస్ పార్టీలో చేర్పించింది హరీశ్ రావు అని చెప్పారు. తాను బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నానని తెలిపారు. తాను బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నానని అసెంబ్లీ స్పీకర్ కూడా ప్రకటించారని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీని కౌశిక్ రెడ్డి నాశనం చేశారని గాంధీ దుయ్యబట్టారు. కౌశిక్ రెడ్డి చీటర్, బ్రోకర్ అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తన మనోభావాలు దెబ్బతినడం వల్లే తాను ప్రతిస్పందించాల్సి వచ్చిందని చెప్పారు. పదేపదే తనను రెచ్చగొట్టడం వల్లే స్పందించాల్సి వచ్చిందని అన్నారు. పిల్లిని గదిలో బంధించి కొడితే... అది కూడా తిరగబడుతుందని చెప్పారు.

సెటిలర్ల కాలిలో ముల్లు గుచ్చుకుంటే తన పంటితో తీస్తానని గతంలో కేసీఆర్ చెప్పారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ సూచించిన వారికే పీఏసీ పదవి ఇవ్వాలని ఏమీ లేదన్నారు. గతంలో పీఏసీ పదవిని కాంగ్రెస్ నేతకు కాకుండా అక్బరుద్దీన్ ఒవైసీకి ఎందుకిచ్చారని ప్రశ్నించారు. మరోవైపు బీఆర్ఎస్ నేతలు 'ఛలో గాంధీ' నివాసానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆయన ఇంటి వద్ద పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించారు.

# ఆరు స్థానాల్లో కాంగ్రెస్ మద్దతు దారులు విన్

**హైదరాబాద్ పెన్ పవర్:** ఉమ్మడి నల్గొండ, రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తి సహకార సంఘం మదర్ డెయిరీ (నార్ముల్) హస్తం పార్టీ తన ఖాతాలో వేసుకుంది. ఇవాళ ఎన్నికల రిజల్ట్‌లో ఆరు డైరెక్టర్లకు గాను ఆరు డైరెక్టర్లు కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు విజయం సాధించారు. క్లీన్ స్వీప్ కావటంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాడి రైతులు బాణాసంచా కాలుస్తూ సంబురాలను జరుపుకున్నారు. మిఠాయిలు పంచుకున్నారు.గెలుపొందిన డైరెక్టర్లను ప్రభుత్వ విఫ్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ గెలుపు రైతుల విజయమని చెప్పారు. ప్రభుత్వం సహకారంతో డెయిరీ ని అన్ని విధాలుగా డెపలఫ్‌మెంట్ చేయడానికి కృషి చేస్తామన్నారు. కొత్తగా గెలిచిన డైరెక్టర్లు రైతుల కోసం అంకితభావంతో వర్క్ చేయాలన్నారు. డెయిరీ లో నెలకొన్న సమస్యలపై త్వరలోనే మీటింగ్ పెట్టి పరిష్కరించేందుకు కృషి చేస్తమన్నారు. బీఆర్ఎస్ కు భవిష్యత్తు లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందన్నారు.



# కేజీబీవీ ఆరో తరగతి విద్యార్థిని హత్మహత్యాయత్నం




**హైదరాబాద్ పెన్ పవర్:**మద్దిరాల మండలం కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ఓ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసింది. స్కూల్ రెండో అంతస్తుపై నుంచి దూకి ఆరో తరగతి విద్యార్థిని సూసైడ్ చేసుకోబోయింది. తుంగతుర్తి నియోజకవర్గం మద్దిరాల మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పాఠశాల సిబ్బంది వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నం చేసుకుందని తల్లిదండ్రుల ఆరోపిస్తున్నారు. తీవ్రగాయాలైన విద్యార్థిని జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం ఉదయం ఇది జరగగా కేజీబీవీ పాఠశాల సిబ్బంది సాయంత్రం వరకు బయటకు తెలియకుండా గోప్యంగా ఉంచారు.

# హైదరాబాద్‌లో ఘరానా మోసం.. రూ. 700 కోట్లు దోచుకున్న కంపెనీ



**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రజల అత్యాశను ఆయుధంగా మలుచుకొని ఓ సంస్థ కోట్లు దోచేసింది. అధిక లాభాల పేరుతో ప్రజల నుంచి పెట్టుబడులు సేకరించి బోర్డు తిప్పేసింది. ఈ ఘటన హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో వెలుగు చూసింది.తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు అంటూ డీకేజెడ్ టెక్నాలజీస్ అనే సంస్థ ప్రజల పెట్టుబడులు సేకరించింది. ఈ మొత్తం దాదాపు 700 కోట్ల రూపాయలు. చివరకు లాభాలు పక్కనపెడితే అసలకే టోపీ పెట్టింది. నగర వ్యాప్తంగా 18 వేల మంది బాధితులు ఈ ఉచ్చులో చిక్కుకున్నారు. ఈ ఘటనలో డబ్బులు పోగొట్టుకున్న వందలాది బాధితులు శుక్రవారం(సెప్టెంబర్ 13) సోమాజిగూడ ప్రెస్ క్లబ్ వద్దకు చేరుకున్నారు. మీడియాతో తమ బాధను పంచుకున్నారు. పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని బాధితులు వాపోయారు. బాధితుల్లో ఒకే వర్గానికి చెందిన వారే ఎక్కువగా ఉన్నారు.

## 10 ఏండ్ల పాలనలో అప్పులపాలైన తెలంగాణ సుభిక్షంగా ఉండాలని కోరుకున్నా: ఎంపీ గడ్డం వంశీకృష్ణ



**హైదరాబాద్ పెన్ పవర్:** ఖైరతాబాద్ బడా గణేష్‌ను శుక్రవారం పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఖైరతాబాద్ గణనాథుని దర్శించుకోవడం సంతోషంగా ఉందని ఎంపీ గడ్డం వంశీ కృష్ణ అన్నారు. నవరాత్రి ఉత్సవాలు ఖైరతాబాద్ ఉత్సవ కమిటీ బాగా ఏర్పాటు చేశారని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. గత10 ఏండ్ల పాలనలో అప్పులపాలైన తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆయన దేవుణ్ణి ప్రార్థించినట్లు తెలిపారు. ఇటీవల సంభవించిన వరద బాధితులు ఎవరైతే ఉన్నారో వారు త్వరగా కోలుకోవాలని కోరుకున్నానన్నారు. పెద్దపల్లి ఎంపీ అందరూ బాగుండాలని భగవంతుని ప్రార్థించినట్లు తెలిపారు.

## హైదరాబాద్‌లో కుంగిన రోడ్డు



**హైదరాబాద్ పెన్ పవర్:**గ్రేటర్ హైదరాబాద్‌లో రోడ్లు బాలేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతుంటే.. దీనికి తోడు ట్రాఫిక్ తిప్పలు పెరిపోతున్నాయి. హైదరాబాద్ లోని ఓ ప్రధాన రద్దీ ఏరియాలో శుక్రవారం రోడ్డు అకస్మాత్తుగా కుంగిపోయింది. మియాపూర్ దీప్తిశ్రీ నగర్‌లో డ్రైనేజీలోకి రోడ్డు కుంగిపోయింది. దీంతో నడి రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడింది. అటుగా వెళ్లే ప్రయాణికులకు ఆ గుంత ఇబ్బందిగా మారింది. స్థానికులు GHMC అధికారులకు సమాచారం ఇచ్చారు. కుంగిన రోడ్డు పక్కనే వాటర్ పైప్ లైన్, డ్రైనేజీ పైప్ లైన్ ఉండటంతో GHMC అధికారులు పరిశీలిస్తున్నారు. మరమ్మత్తులు చేయడానికి ఆర్ అండ్ బీ అధికారులు రంగంలోకి దిగారు.

## మంకీపాక్స్‌కు వ్యాక్సిన్..
## WHO ఆమోదం




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచదేశాలను వణికిస్తోన్న ప్రాణాంతక మంకీపాక్స్ వ్యాధికి డెన్మార్క్ సంస్థ బవేరియన్ నార్డిక్( టీకాను అభివృద్ధి చేసింది. టీకా పేరు.. జిన్నెయోస్ ఈ వ్యాక్సిన్ అత్యవసర వినియోగానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ అనుమతి ఇచ్చింది. వ్యాక్సినియా అంకారా–బవేరియన్ నార్డిక్ గా పిలువబడే ఈ టీకాను 18 ఏళ్ల వయసు పైబడిన వారికి ఈ వ్యాక్సిన్‌ను రెండు డోసుల్లో ఇవ్వాలి. మోతాదుల మధ్య నాలుగు వారాల విరామం ఉంటుంది. 2నుండి 8 డిగ్రీల సెల్సియస్ చల్లని ఉష్ణోగ్రతల వద్ద టీకాను ఎనిమిది వారాల వరకు నిల్వ ఉంచవచ్చు. అయితే, 18 ఏళ్లలోపు ఉన్నవారికి టీకా ఇచ్చేందుకు అనుమతి లేనప్పటికీ.. వ్యాధి తీవ్రత అధికంగా ఉన్న చిన్నారులు, గర్భిణీ స్త్రీలు, యుక్తవయసు వారు, రోగనిరోధక శక్తి లేని వారికి దీన్ని ఇవ్వవచ్చని డబ్ల్యూహెచ్‌వో తెలిపింది. బవేరియన్ నార్డిక్ సంస్థ అభివృద్ధి చేసిన ఈ ఎంపాక్స్ వ్యాక్సిన్‌ను( ప్రభుత్వాలు, గావీ( , యునిసెఫ్ వంటి అంతర్జాతీయ ఏజెన్సీలు కొనుగోలు చేయొచ్చు. తయారీ సంస్థ ఒక్కటే కావడంతో ప్రస్తుతం పరిమిత సంఖ్యలోనే వీటి ఉత్పత్తి జరుగుతోంది. అయినప్పటికీ ముఖ్యమైన ప్రాంతాల్లో తక్షణమే ఈ వ్యాక్సిన్ అందించేందుకు ముమ్మర చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపునిచ్చింది. కాగా, జపాన్‌కు చెందిన KM బయోలాజిక్స్ తయారు చేసిన LC16 అనే మరో వ్యాక్సిన్‌ను కూడా WHO సమీక్షిస్తోంది.

## భక్తులకు విజప్తి :సెప్టెంబర్ 16 వరకే ఖైరతాబాద్ గణేష్
# దర్శనం.. మార్నింగ్ టైంలో వెళ్తే బెటర్

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలుగు రాష్ట్రాల్లో ప్రఖ్యాతి పొందిన ఖైరతాబాద్ బడా గణేష్‌ను రోజుకు లక్షమందికి పైగా భక్తులు దర్శించుకుంటున్నారని సైఫాబాద్ ఏసిపి సంజయ్ కుమార్ అన్నారు. లాస్ట్ వీకెండ్ లో అయితే ఆ సంఖ్య రెండు లక్షలకు పైగా ఉందన్నారు. ప్రజలందరూ సాయంత్రం వేళ దర్శనాలకు వస్తుండడంతో ఆ టైంలో భక్తుల రద్దీ పెరుగుతోంది. నతరాత్రులు దగ్గర పడుతుండటంతో దర్శనానికి వచ్చే వారి సంఖ్య కూడా పెరుగుతుందని.. మార్నింగ్ టైంలో దర్శనాలకు వస్తే మంచిదని భక్తులకు ఆయన విజ్ఞప్తి చేశారు.వృద్దులు, చిన్నపిల్లలు క్రౌడ్ ఎక్కువగా ఉన్న సమయాల్లో వచ్చి ఇబ్బందులు పడొద్దని కోరారు. సెప్టెంబర్17న ఉదయం 6 గంటలకు ఖైరతాబాద్ బడా గణేష్ నిమజ్జనానికి బయలుదేరుతాడని భద్రతా ఏర్పాటు పర్యవేక్షించే




ఏసిపి అధికారి తెలిపారు. మధ్యాహ్నం 1 గంటలలోపే నిమజ్జనం చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సెప్టెంబర్16 వరకే భక్తులను దర్శనానికి అనుమతి ఇస్తామని అన్నారు. బడా గణేష్ చుట్టూ ఉన్న భారీ సెట్టింగ్లు, బ్యారిగేట్లు తొలగించే పని 16న ప్రారంభిస్తారు. ఆ రోజు దర్శనానికి అనుమతి ఉండదని భక్తులు గమనించాలి. నిమజ్జనానికి ట్యాంక్ బండ్ దగ్గర పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశాము. ఖైరతాబాద్ బడా గణేష్ నిమజ్జనానికి వెళ్లే రూట్ మొత్తం పకడ్బందీగా ఏర్పాటు చేశాము.

## అయ్యో వెజ్‌ను నాన్‌వెజ్ చేశారే..!:
# సమోసాలో 'కప్ప కాలు'



**హైదరాబాద్ పెన్ పవర్:**బిర్యానీ తిందామంటే బొద్దింకలు.. సాంబార్ తిందామంటే చచ్చిన ఎలుకలు.. జ్యూస్ తాగుదామంటే బల్లులు.. ఐస్ క్రీమ్ తిందామంటే మనిషి వేళు.. చాక్లెట్ తిందామంటే పురుగులు.. ఇలాంటి ఘటనలు రోజుకొకటి వెలుగు చూస్తున్నాయి. ఇవి పొరపాటున పడుతున్నాయో.. లేదంటే రుచి కోసం వారే వేస్తున్నారో వడ్డిస్తున్న వారికే తెలియాలి.

తాజాగా, కడుపారా ఇష్టమైన సమోసా తిందామనుకున్న ఓ యువకుడికి 'కప్ప కాలు' దర్శనమిచ్చింది. అది కూడా సగం తిన్నాక కనపడటంతో అతని బాధ మాటల్లో చెప్పలేనిది. తిన్న సమోసాలో సగం కాలే కనపడటంతో.. దుకాణం యజమానితో గొడవ తరువాత బయటకెళ్లి ఇంకో సగం కోసం అరగంట పాటు వాంతులు చేసుకున్నాడట.

అయినప్పటికీ అది కనిపించలేదట. బహుశా.. మెత్తగా నమిలేసి మింగేశాడేమో..! ఈ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో చోటుచేసుకుంది. ఘజియాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి స్థానికంగా ఉన్న బికనీర్ స్వీట్స్ షాప్‌లో సమోసా కొనుగులో చేశాడు. అసలే ఆకలి మీద ఉండటంతో ఆత్రుతగా దానిని తినడం మొదలు పెట్టాడు. ఇంతలో అతనికి నాన్ వెజ్ ముక్క కప్ప కాలు దర్శనమిచ్చింది. కనిపించిన ఆ కప్ప కాలు కూడా కుళ్లిపోయిన స్థితిలో ఉంది. ఇంకేముంది.. ఆవురావురమంటూ స్వీట్ షాప్ యజమాని వద్దకు పరుగులు చేశాడు. తన సమోసాలో వచ్చిన కప్పకాలు ఘటనపై అతన్ని ప్రశ్నించాడు. వారిపై తీవ్ర స్థాయిలో మండిపడ్డాడు. అనంతరం పోలీసులకు, ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ సన్నివేశాలను అక్కడున్న వారు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

మీరూ బయట ఫుడ్ తినే అలవాటు ఉంటే వీలైనంత త్వరగా మానుకోండి. లేదంటే నేరుగా నాన్ వెజ్ ఆర్డర్ చేసుకొని తినేయండి. ఒకవేళ చచ్చిన బొద్దింకలు, ఎలుకలు వచ్చినా ముక్కల్లో కలిసిపోతాయి.

## నేనేమైనా చేతగాని వాడినా.. కౌశిక్ నోరు అదుపులో పెట్టుకోవాలి : అరికెపూడి వార్నింగ్



**హైదరాబాద్ పెన్ పవర్:**ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఆంధ్రా, తెలంగాణ అంటూ ప్రాంతీయ విభేదాలు రెచ్చగొట్టి.. తరిమి కొడతా అంటే ఊరుకోవడానికి తానేమి చేతగాని వాడిని కాదని ఎమ్మెల్యే అరికపూడి గాంధీ కౌంటర్ ఇచ్చారు. బీఆర్ఎస్ లో సీనియర్ నాయకులు ఉన్నా.. నిన్న మొన్న వచ్చిన కౌశిక్ రెడ్డి దుర్భాషలాడుతున్నాడని ఫైర్ అయ్యారు గాంధీ. కౌశిక్ రెడ్డి నా ఇంటికి వస్తా అంటే ఆయన ఏమైనా రౌడీనా అని గాంధీ ఎద్దేశా చేశారు. కౌశిక్ రెడ్డికి వార్నింగ్ ఇస్తూ ఎమ్మెల్యే గాంధీ ఇలా ఇన్నారు.. 'నీ కంటే ముందు నాకు పార్టీలో పరిచయాలు ఉన్నాయ్. నాతో మంచిగా మాట్లాడేవాళ్ళు ఆ పార్టీలో లేరా? బీఆర్ఎస్ లో కౌశిక్ కు ఉన్న పదవి ఏంటి? ఆ పార్టీని కౌశిక్ బ్రష్టుపట్టిస్తున్నాడు. మహిళలను, రాష్ట్ర గవర్నర్ ను అవమానకర రీతిలో మాట్లాడాడు. పదేళ్లలో కేసిఆర్ గారు ఆంధ్రా, తెలంగాణ ప్రాంతీయ విద్వేషాలు కంట్రోల్ చేశారు. ఆంధ్రోళ్ల పవర్, తెలంగాణోళ్లు పవర్ అంటూ కౌశిక్ రెచ్చగొడుతున్నాడు. నేను మాట్లాడిన బాషా తప్పే.. కానీ, నీ రెచ్చగొట్టే భాషకు నేను స్పందించాల్సి వచ్చింది. నేను పదేళ్లు గా క్రమశిక్షణగా ఉన్నా.. నువు తరిమి కొడతా అంటే చాతకానివాడు ఎవడు లేడు' అని నోరు అదుపులో పెట్టకోవాలని గాంధీ.. కౌశిక్ రెడ్డికి సూచించారు.

## ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు.. తెలంగాణ డీజీపీ జితేందర్ హెచ్చరిక!



**హైదరాబాద్ పెన్ పవర్:**బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, అరికెపూడి గాంధీ మధ్య నెలకొన్న వివాదం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశం అవుతోంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ నేతల తీరుపై డీజీపీ జితేందర్ మండిపడ్డారు. ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకునేందుకు ప్రయత్నించవద్దని హెచ్చరించారు. హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ పరిధిలో ఎలాటి ఆందోళలనకు అవకాశం లేదని తెలిపారు. విద్వేషాలను రెచ్చగొడితే ఏమాత్రం సహించబోమని హెచ్చరించారు. తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీస్తే ఊరుకోబోమని అన్నారు. కాగా, ఇద్దరు ఎమ్మెల్యేల మధ్య నెలకొన్న వివాదం గురువారం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసిన విషయం తెలిసిందే. చివరికి ఈ వివాదం పలువురు బీఆర్ఎస్ కీలక నేతల అరెస్టల వరకు వెళ్లింది.

# మరో చరిత్ర సృష్టించిన స్పేస్ ఎక్స్...




**న్యూస్ డెస్క్ పెన్‌పవర్, న్యూయార్క్, సెప్టెంబర్ 13:** స్పేస్‌ఎక్స్ చరిత్ర సృష్టించింది. అంతరిక్షంలో తొలిసారి ప్రైవేట్ స్పేస్‌వాక్‌ను నిర్వహించింది. 'పొలారిస్ డాన్' మిషన్‌లో భాగంగా స్పేస్‌ఎక్స్‌కు చెందిన ఫాల్కన్-9 రాకెట్ ద్వారా మంగళవారం నలుగురు నింగిలోకి వెళ్లారు. వారిలో ఒకరైన ప్రముఖ వ్యాపారవేత్త జేర్డ్ ఇస్సాక్‌మన్ గురువారం తొలుత క్యాప్సూల్ నుంచి బయటకు వచ్చి స్పేస్‌వాక్ నిర్వహించారు. ప్రొఫెషనల్ వ్యోమగాములు కాకుండా.. అంతరిక్షంలో స్పేస్‌వాక్ నిర్వహించిన తొలి వ్యక్తిగా ఇస్సాక్‌మన్ చరిత్ర సృష్టించారు. అనంతరం స్పేస్‌ఎక్స్ ఇంజినీర్ సారా గిల్లిస్ ఆయన్ను అనుసరించారు. అంతరిక్ష నడకను 30 నిమిషాల పాటు నిర్వహించారు.వీరికి రెండు గంటలు సమయం పట్టింది. స్పేస్‌వాక్ సందర్భంగా మస్క్ సంస్థ తయారుచేసిన స్పేస్‌సూట్‌ను వారు పరీక్షించారు. ఐసాక్‌మన్ అంతరిక్షంలో నడుస్తోన్న ఫొటోను మస్క్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. భూమి నుంచి బయలుదేరిన 15 గంటల తర్వాత 1400.7 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకొని పొలారిస్ డాన్ మిషన్ అరుదైన మైలురాయిని అందుకుంది. కాగా, 'అంతరిక్షం నుంచి తిరిగి వచ్చినప్పుడు మనందరికీ చాలా పని ఉంది, కానీ ఇక్కడ నుంచి భూమి ఖచ్చితంగా పరిపూర్ణ ప్రపంచంలా కనిపిస్తుంది' అని ఇస్సాక్‌మన్ వ్యాఖ్యానించారు.విజయవంతమైన ఈ మిషన్ నాసా వంటి ప్రభుత్వ ఏజెన్సీలకు చెందిన ప్రొఫెషనల్ వ్యోమగాములకు అంతరిక్ష ప్రయాణం ఇకపై ప్రత్యేకం కాదని నొక్కి చెబుతుంది.

ఒకప్పుడు స్పేస్‌వాక్‌లో వ్యోమగాములను అంతరిక్షం శూన్యంలో సూట్‌ల మాత్రమే రక్షణ కల్పించేవి. వాణిజ్య మిషన్‌లలో భాగంగా స్పేస్‌ఎక్స్ చేపట్టి పొలారిస్ సిరీస్మూడు మిషన్లలో ఇది మొదటిది. అంగారక గ్రహానికి మానవులను పంపాలనే మస్క్ ప్రాజెక్ట్‌కు మద్దతు ఇచ్చేలా సాంకేతిక పురోగతిని వేగవంతం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది.ఇక, తొలి వాణిజ్య స్పేస్‌వాక్ విజయవంతం కావడంపై నాసా అడ్మినిస్ట్రేటర్ బిల్ నెల్సన్ హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయం అంతరిక్ష వాణిజ్యాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు, చైతన్యవంతమైన అంతరిక్ష ఆర్థిక వ్యవస్థను నిర్మించాలనే దీర్ఘకాలిక లక్ష్యాన్ని చేరుకోడానికి తోడ్పడుతుందని ఆయన అన్నారు

# అగ్నిపథ్ లోనూ... రిజర్వేషన్లు



**న్యూస్ డెస్క్ పెన్‌పవర్ భువనేశ్వర్, సెప్టెంబర్ 13:** త్రివిధ దళాల్లో చేరే సైనికులకు సంబంధించి కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన అగ్నిపథ్ పథకం దేశంలో తీవ్ర విమర్శలకు తావిచ్చింది. అగ్నిపథ్ పథకం కింద ఎంపికైన వారిని అగ్నివీరులుగా 4 ఏళ్ల పాటు సైన్యంలో పనిచేయించిన తర్వాత వారిని బయటకు పంపిస్తామని చెప్పడంతో యువతతోపాటు ప్రతిపక్ష పార్టీల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో ఇటీవల కేంద్ర ప్రభుత్వం అగ్నిపథ్ పథకంలో కొన్ని మార్పులను తీసుకువచ్చింది. మరోవైపు.. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మాజీ అగ్నివీరులకు రిజర్వేషన్లు ప్రకటించారు. ఇక కొన్ని నెలల క్రితం ఒడిశాలో అధికారంలోకి వచ్చిన బీజేపీ.. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన హామీ మేరకు మాజీ అగ్నివీరులకు ఒడిశా ప్రభుత్వం రిజర్వేషన్లు కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. యూనిఫామ్ సర్వీసుల్లోని గ్రూప్ సీ,డీ ఉద్యోగాల్లో నేరుగా నియామకాలు ఇచ్చేలా చేసిన ప్రతిపాదనకు ఒడిశా మంత్రివర్గం ఆమోదం కల్పించింది.ఒడిశాలో గ్రూప్ సీ, డీ ఉద్యోగాల్లో అగ్నివీరులుగా పనిచేసి రిటైర్ అయిన వారికి 10శాతం రిజర్వేషన్లు ప్రకటిస్తూ మోహన్ మాఝి నేతృత్వంలోని ఒడిశా కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఇక ఈ మాజీ అగ్నివీరులను యూనిఫామ్ సర్వీసుల్లోకి నేరుగా నియమించుకుంటామని పేర్కొంది. అయితే ఇప్పటివరకు అమల్లో ఉన్న ఎక్స్‌సర్వీస్‌మెన్ కోటాకు అదనంగా ఈ అగ్నివీరులకు 10శాతం రిజర్వేషన్ కల్పించనున్నట్లు చెప్పారు. సీఎం మోహన్ మాఝి నేతృత్వంలో సమావేశమైన కేబినెట్.. ఈ నిర్ణయం తీసుకుంది. ఎక్స్ అగ్నివీర్ రూల్స్ 2024కు ఆమోదం కల్పించింది.దీని ప్రకారం ఒడిశాలోని పోలీస్, ఎక్సైజ్, అటవీశాఖ, ఫైర్ డిపార్ట్‌మెంట్ లేదా ఇతర శాఖల్లో మాజీ అగ్నివీరులకు అవకాశాలు లభించనున్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఇక ఈ యూనిఫామ్ సర్వీసుల్లో నియామకాల సందర్భంగా మాజీ అగ్నివీర్‌లు కచ్చితంగా కొన్ని అర్హతలను పూర్తి చేయాల్సి ఉంటుందని తెలిపారు. అగ్నివీరులకు ఫిజికల్ టెస్ట్ నుంచి మినహాయింపు ఉంటుందని.. దీంతోపాటు 3 ఏళ్ల సడలింపు లభిస్తుందని పేర్కొంది. సార్వత్రిక ఎన్నికల తర్వాత కేంద్ర ప్రభుత్వం కూడా అగ్నిపథ్‌కు సంబంధించి కీలక మార్పులు తీసుకుంది. మాజీ అగ్నివీరుల విషయంలో కేంద్ర పారామిలటరీ బలగాలైన సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్, ఆర్పీఎఫ్‌లు కీలక నిర్ణయం తీసుకున్నాయి. భవిష్యత్తులో చేపట్టే కానిస్టేబుల్ నియామకాల్లో మాజీ అగ్నివీరులకు 10శాతం రిజర్వ్ చేస్తున్నట్టు జులైలోనే ప్రకటించింది.అగ్నిపథ్ పథకాన్ని జూన్ 2022న కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. 17 నుంచి 21 ఏళ్ల వయసు ఉన్న యువత మాత్రమే త్రివిధ దళాల్లో అగ్నివీర్‌లుగా విధులు నిర్వహించేందుకు అర్హులు అని కేంద్రం తెలిపింది. 4ఏళ్ల తర్వాత సర్వీస్ నుంచి తప్పుకున్న అగ్నివీర్‌లకు పింఛను సహా ఇతర సైనికులు అందుకునే సౌకర్యాలు ఏవీ కల్పించరు. వారిలో 25శాతం మందిని మాత్రమే మరో 15 ఏళ్ల పాటు రెగ్యులర్ సర్వీస్‌లోకి తీసుకుంటారు. దీంతో ఈ అగ్నిపథ్ పథకంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు రిజర్వేషన్లు ప్రకటిస్తున్నాయి.

# ప్రణతి షిండేతో రాహుల్ పెళ్లి....?

**న్యూస్ డెస్క్ పెన్‌పవర్, ముంబై, సెప్టెంబర్ 13:** ఎవరైనా పెళ్లి చేసుకుంటున్నారంటే తోటి స్నేహితులకు, కుటుంబ సభ్యులకు చాలా ఆసక్తి ఉంటుంది. అమ్మాయి ఎవరు? ఎక్కడ ఉంటుంది? అనే వివరాల కోసం వెంటనే ఆరాధిస్తారు. అలాగే సినీ ఇండస్ట్రీకి చెందిన సెలబ్రెటీల పెళ్లి విషయం రాగానే వెంటనే వారు చేసుకోబోయేది ఎవరు? అని తెలుసుకునేందుకు ట్రై చేస్తారు. అయితే రాజకీయ నాయకుల పెళ్లిళ్ల గురించి పెద్దగా పట్టించుకోరు. కానీ మోస్ట్ ఎల్జిబుల్ బ్యాచ్ లర్, కాంగ్రెస్ జాతీయ నేత రాహుల్ గాంధీ పెళ్లి విషయం అనగానే దేశ వ్యాప్తంగా చర్చ సాగుతూ ఉంటుంది. ఎందుకంటే దేశంలో ప్రధాన ప్రతిపక్ష నేతగా కొనసాగుతున్న రాహుల్ గాంధీ వయసు మీద పడుతున్నా పెళ్లి గురించి ఎవరైనా అడిగితే సమాధానం దాటవేస్తూ వస్తున్నారు. కానీ తాజాగా ఆయన గురించి ఓ ఆసక్తి కర చర్చ సాగుతోంది. త్వరల్లోనే ఓ రాజకీయ నాయకుడి కూతురును వివాహం చేసుకోబోతున్నారన్న ప్రచారం సాగుతోంది. కాంగ్రెస్ జాతీయ నేత రాజకీయాల్లో తనదైన ముద్ర వేస్తున్నాడు.ఒకప్పుడు ఆయన రాజకీయాల్లో పనికి



రాదు అని అన్నవారు.. ఇప్పుడు ఆయన గురించి ప్రత్యేకంగా చర్చించుకుంటున్నారు. ఎందుకంటే ఎన్ని అడ్డంకులు, ఇబ్బందులు వచ్చినా కాంగ్రెస్ పార్టీని దేశ వ్యాప్తంగా తీసుకెళ్తూ కాపాడుతూ వస్తున్నాడు. అయితే ఇదే క్రమంలో రాహుల్ పెళ్లి ప్రస్తావన పై కూడా జోరుగా చర్చ సాగుతూ ఉంటుంది. తాను ప్రధాని అయిన తరువాతే పెళ్లి చేసుకుంటాడని రాహుల్ నిర్ణయం అని కొందరు అన్నారు. కానీ ఆ మధ్య లండన్ లో ఓ అమ్మాయితో కలిసి ఉన్న ఫోటోతో రకరకాలుగా ప్రచారం చేశారు.తాజాగా రాహుల్ ను ఓ అమ్మాయి పెళ్లి చేసుకోబోతున్నట్లు ప్రచారం జరగుతోంది.అయితే ఆమె ఎవరో కాదు. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి సుశీల్ కుమార్ షిండె కుమార్తె. ఆమె పేరు ప్రణతి షిండే. ప్రస్తుతం షోలాపూర్ ఎస్సీ నియోజకవర్గం నుంచి ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న ఈమెతో కలిసి రాహుల్ జోడో యాత్రలో కలిసి కనిపించారు. అంతేకాకుండా ఎంపీగా గెలిచిన తరువాత ప్రణతి షిండే రాహుల్ ను స్వయంగా ఇంటికి ఆహ్వానించించారు కూడా.ఇదే కాకుండా మే 13న రాయబరేలిలో జరిగిన ర్యాలీలో ప్రణతి షిండేను కొందరు రాహుల్ ను పెళ్లి చేసుకుంటారా? అని ప్రశ్నలు కూడా వేశారు. దీంతో ఆ సమాధానం రాహుల్ ఇవ్వాలని చెప్పిందంట. దీంతో రాహుల్ ను పెళ్లి చేసుకునేందుకు ప్రణతి ఇష్టంగా ఉన్నట్లు కొందరు చెబుతున్నారు. కానీ రాహుల్ నుంచి మాత్రం ఎటువంటి సమాధానం లేదు. కానీ ఈ ప్రచారం పై రాహుల్ ఎలా స్పందిస్తారోనని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే గత 20 నుంచి 30 ఏళ్లుగా రాహుల్ ఎవరిని పెళ్లి చేసుకుంటారోనని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కొందరు తండ్రి లాగే రాహుల్ విదేశీ అమ్మాయిని పెళ్లి చేసుకుంటారని అన్నారు. మరికొందరు మాత్రం ఇండియన్ అమ్మాయినే పెళ్లాడుతారని చెప్పారు. మొత్తంగా రాహుల్ ఎవరిని పెళ్లి చేసుకుంటారో చూడాలి. ఒకవేళ రాహుల్ దీనిపై సానుకూలంగా స్పందిస్తారా? లేదా? అనేది ఆసక్తిగ మారింది.

# పిల్లలు వద్దంటున్న రష్యన్స్...

**న్యూస్ డెస్క్ పెన్‌పవర్, మాస్కో, సెప్టెంబర్ 13:** ఇప్పటి వరకు రెండు ప్రపంచ యుద్ధాలు జరిగాయి. రెండు వర్గాలుగా విడిపోయిన ప్రపంచ దేశాలు ఈ యుద్ధంలో పాల్గొన్నాయి. కొన్ని దేశాలు పరోక్షంగా మద్దతు తెలిపాయి. కొన్ని దేశాలు తటస్థంగా ఉన్నాయి. యుద్ధాల కారణంగా చాలా దేశాలు తీవ్రంగా నష్టపోయాయి. ఈ నేపథ్యంలో మూడో ప్రపంచ యుద్ధం అంటేనే భయపడుతున్నాయి. అయినా సంపన్న దేశాలైన అమెరికా, రష్యా సైనిక చర్యల పేరిట యుద్ధాలు చేస్తున్నాయి. గతంలో అమెరికా ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లో తమ సైన్యాన్ని రంగంలోకి దింపి ఆ దేశాలను తమ అధీనంలోకి తెచ్చుకుంది. ఇక రెండేళ్లుగా రష్యా కూడా ఉక్రెయిన్‌తో యుద్ధం చేస్తోంది. మరోవైపు ఉక్రెయిన్‌కు అమెరికా సాయం అందిస్తోంది. దీంతో ఈ యుద్ధం సుదీర్ఘంగా సాగుతోంది. శక్తివంతమైన రష్యాను చిన్న దేశమైన ఉక్రెయిన్ అమెరికా సాయంతో దీటుగా ఎదుర్కొంటోంది. ఈ యుద్ధ ప్రభావంతో రెండువైపులా తీవ్ర నష్టం జరుగుతోంది. ఉక్రెయిన్ ఇప్పటికే తీవ్రంగా దెబ్బతిన్నది. అయినా రష్యాకు తలొగ్గేది లేదంటున్నారు ఆ దేశ అధ్యక్షుడు జెలెన్స్కీ. ఇక ఉక్రెయిన్ కూడా రష్యాపై అమెరికా అందించిన ఆయుధాలతో దాడులు చేస్తోంది. ఫలితంగా రష్యావైపు కూడా ఆస్తి, ప్రాణ నష్టం జరుగుతోంది. ఇది రష్యా వాసులను ఆందోళనకు గురిచేస్తోంది. మానసికంగా ఆందోళనకు గురిచేస్తోంది.యుద్ధ ప్రభావంతో రష్యా అనేక సమస్యలు ఎదుర్కొంటోంది. తాజాగా కొత్త చిక్కులు వచ్చిపడుతున్నాయి. రష్యాలో జనన? మరణాల్లో అంతరం భారీగా పెరుగుతున్నట్లు తాజాగా విడుదలైన అధికారిక డేటా వెల్లడించింది. ఇందులో వెల్లడించిన గణాంకాల ప్రకారం రష్యాలో ఈ ఏడాదిలో జూన్ వరకు 5,99,600 మంది పిల్లలు జన్మించారు. 2023 జూన్‌లో పోలిస్తే దాదాపు 16 వేల మంది పిల్లలు తక్కువగా పుట్టారు. 2024 జూన్‌లో లక్ష కంటే తక్కువ మంది శిశువులు జన్మించారు. దీంతో నవజాత శిశువుల సంఖ్య 6 శాతం తగ్గినట్లుగా ఇటీవల రష్యన్ మీడియా తెలిపింది. 1999 నుంచి జననాల రేటులో తగ్గుదల కనిపిస్తున్నట్లుగా నివేదిక పేర్కొంటోంది.ఇక 2024 జనవరి నుంచి జూన్ మధ్య 3,25,100 మరణాలు నమోదయ్యాయని, గత ఏడాదితో పోలిస్తే ఇవి 49 వేలు అధికమని పేర్కొంది. రష్యాకు వచ్చిన వలసదారుల జనాభా 20.1 శాతం ఉండటంతో ఈ క్షీణత కొంతవరకు భర్తీ అయినట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. దేశంలో తక్కువ



జననాలు నమోదవడాన్ని క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ ఓ విపత్తుగా అభివర్ణించారు. ఇటీవల రష్యా దిగువ సభ డూమాలోని కుటుంబాల రక్షణ కమిటీ అధిపతి నినా ఒస్టానినా మాట్లాడుతూ జననాల రేటు తగ్గుదలపై ఆందోళన వ్యక్తంచేశారు. దీనికోసం 'ప్రత్యేక జనాభా ఆపరేషన్' చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.జనన రేటు పెంచేందుకు సోవియట్ కాలంలో అమల్లో ఉన్న పథకాన్ని అధ్యక్షుడు పుతిన్ మళ్లీ పునరుద్ధరించారు. 10, అంతకంటే ఎక్కువమంది పిల్లల్ని కనే మహిళలకు మిలియన్ రూబెల్స్ (భారత కరెన్సీలో దాదాపు రూ.13 లక్షలకు పైన) నజరానా, 'మదర్ హీరోయిన్' అవార్డును ఇస్తామని రష్యా ప్రభుత్వం ప్రకటించింది. అయితే 10వ బిడ్డ మొదటి పుట్టినరోజు నాడు ఈ నగదు చెల్లిస్తామని పేర్కొంది. అప్పటికి మిగతా 9 మంది పిల్లలు జీవించి ఉండాలని షరతు పెట్టారు. ఈ అవార్డుకు సంబంధించి అప్పట్లో రష్యా మీడియాలో పలు కథనాలు వెలువరించాయి. అయినా జనాభాలో పెరుగుదల కనిపించకపోవడంతో ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేస్తోంది.రష్యా?ఉక్రెయిన్ యుద్ధం కారణంగా భారీగా సైనికులు, ప్రజలు ప్రాణాలు కోల్పోతుండటంతో జనన?మరణాల్లో అంతరం భారీగా పెరుగుతుందనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. ఉక్రెయిన్‌పై రష్యా సైనిక చర్య మొదలు పెట్టిన నాటినుంచి వేలాది మంది క్రెమ్లిన్ సైనికులు మరణించినట్లు అంతర్జాతీయ అధ్యయనాలు పేర్కొన్నాయి. ఈ యుద్ధంలో ఇప్పటి వరకు దాదాపు 15 వేల మంది రష్యా సైనికులు మృతిచెంది ఉంటారని అంచనా. అయితే రష్యా మాత్రం ఈ వార్తలను తోసిపుచ్చుతోంది.

## నేడు హిందీ భాషా దినోత్సవం

హిందీ భాషా దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం సెప్టెంబరు 14 న జరుపుకుంటారు. భారత జాతీయోద్యమంలో అఖిల భారతాన్ని జాగృతం చేసి, ఏకతాటిపై నడిపేందుకు హిందీ భాష ఆనాడు దోహద పడినందున గాంధీజీ స్ఫూర్తితో 1949 సెప్టెంబరు 14న రాజ్యాంగంలోని 351 వ అధికరణం 8వ షెడ్యూల్‌లో హిందీని జాతీయభాషగా గుర్తిస్తూ పొందుపరిచారు.





అప్పటి నుంచి ప్రతి ఏటా ఈ రోజున హిందీ భాషా దినోత్సవమును జరుపుకుంటారు. దేవనాగరి లిపిలో వ్రాయబడిన హిందీ భాషను రిపబ్లిక్ ఆఫ్ ఇండియా రెండు అధికారిక భాషలలో ఒకటిగా భారత రాజ్యాంగ సభచే జరుపుకుంటారు. ఈ మేరకు హిందీకి అనుకూలంగా బీహార్ రాజేంద్ర సింహాతో పాటు హజారీ ప్రసాద్ ద్వివేది, కాకా కలేల్కర్, మైథిలి శరణ్ గుప్త్, సేథ్ గోవింద్ దాస్ లు ర్యాలీలు చేసారు. అందుకని, 1949 సెప్టెంబర్ 14 న బీహార్ రాజేంద్ర సింహా 50 వ పుట్టినరోజున, హిందీని అధికారిక భాషగా స్వీకరించిన తరువాత వారి ప్రయత్నాలు ఫలించాయి. ఈ నిర్ణయం 1950 జనవరి 26 న అమల్లోకి వచ్చిన భారత రాజ్యాంగం ఆమోదించింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 343 ప్రకారం, దేవనాగరి లిపిలో వ్రాసిన హిందీని అధికారిక భాషగా స్వీకరించారు. మొత్తం మీద, భారతదేశంలో 22 షెడ్యూల్డ్ భాషలు ఉన్నాయి, వాటిలో రెండు అధికారికంగా యూనియన్ స్థాయిలో ఉపయోగించబడతాయి. హిందీ, ఇంగ్లీష్. ఆధునిక హిందీని నేడు 250 మిలియన్లకు పైగా ప్రజలు మొదటి భాషగా మాట్లాడుతున్నారు. భారత మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ న్యూఢిల్లీ లోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో హిందీకి సంబంధించిన వివిధ రంగాలలో రాణించినందుకు వివిధ విభాగాలలో పురస్కారాలులు ప్రధానం చేశారు.మంత్రిత్వ శాఖలు, విభాగాలు, పిఎస్‌యులు, జాతీయం చేసిన బ్యాంకులకు రాజ్‌భాషా పురస్కారాలు ప్రధానం చేశారు.హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ 2015 మార్చి 25 నాటి ఉత్తర్వులలో హిందీ దివాస్‌పై ఏటా ఇచ్చే రెండు పురస్కారాల పేర్లను మార్చింది. 1986 లో స్థాపించబడిన "ఇందిరా గాంధీ రాజ్‌భాషా పురస్కార్"ను "రాజ్‌భాషా కీర్తి పురస్కార్"గా మార్చారు. 'రాజీవ్ గాంధీ రాష్ట్రీయ జ్ఞాన్–విజ్ఞాన్ మౌలిక్ పుస్తక్ లేఖన్ పురస్కార్' ను "రాజ్‌భాషా గౌరవ్ పురస్కార్"గా మార్చారు.

# హైదరాబాద్ రాష్ట్రానికి ఎన్నికైన తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు

## -నేడు ఆయన వర్ధంతి

బూర్గుల రామకృష్ణారావు బహుభాషావేత్త, స్వాతంత్ర్యోద్యమ నాయకుడు, రచయిత, న్యాయవాది. హైదరాబాదు రాష్ట్రానికి ఎన్నికైన తొలి ముఖ్యమంత్రి. రెండు రాష్ట్రాలకు గవర్నరుగా కూడా పనిచేసాడు. రామకృష్ణరావు 1899 మార్చి 13 న నరసింగరావు, రంగనాయకమ్మ దంపతులకు మహబూబ్ నగర్ జిల్లా, తలకొండ పల్లి మండలం కల్వకుర్తి దగ్గరలోని పడకల్ గ్రామంలో జన్మించాడు. వీరి స్వగ్రామం బూర్గుల, ఇంటి పేరు పుల్లం రాజు వారు. అయితే స్వగ్రామమైన బూర్గుల నామమే వారి ఇంటిపేరుగా మారింది. ధర్మవంత్ స్కూలు (హైదరాబాద్) లో ప్రాథమిక విద్యను అభ్యసించాడు. 1915లో మెట్రిక్ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యాడు. పూణె లోని ఫెర్గూసన్ కళాశాలలో బీఏ (హానర్స్) డిగ్రీ చదివాడు. బొంబాయి విశ్వవిద్యాలయం నుంచి ఎల్ఎల్బీ (లా డిగ్రీ) పూర్తిచేసి, హైదరాబాద్లో న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. బూర్గుల దగ్గర పివినరసింహారావు జూనియర్ లాయర్గా పనిచేశాడు. బూర్గుల1924లో పెళ్ళి చేసుకున్నాడు. 1923లో హైదరాబాదులో న్యాయవాద వృత్తి ప్రారంభించి అగ్రస్థాయికి చేరాడు. న్యాయవాదిగా ఉంటూనే, రాజకీయాల్లో పాల్గొనడం జరిగింది. ఆంధ్రోద్యమం, గ్రంథాలయోద్యమం, భూదానోద్యమం మొదలైన వాటిలో పాల్గొన్నాడు. మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి మొదలైన వారితో కలిసి పనిచేసాడు. శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయంకు అధ్యక్షుడిగా, కార్యదర్శిగా పనిచేసాడు. హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెసు



వ్యవస్థాపకుల్లో బూర్గుల ప్రముఖుడు. పార్టీ తరపున ఆయన అనేక కార్యక్రమాలకు నేతృత్వం వహించాడు. 1931లో నల్గొండ జిల్లా దేవరకొండలో జరిగిన రెండవ ఆంధ్రమహాసభకు బూర్గుల అధ్యక్షత వహించాడు. శాసనోల్లంఘన ఉద్యమంలోను, క్విట్ ఇండియా ఉద్యమంలోను పాల్గొని కారాగారవాసం అనుభవించాడు. 1948లో పోలీసు చర్య తరువాత హైదరాబాదు రాష్ట్రం ఏర్పాటు అయి, వెల్లోడి ముఖ్యమంత్రిగా సైనిక ప్రభుత్వం ఏర్పడినపుడు, ఆయన రెవిన్యూ, విద్యాశాఖల మంత్రి అయ్యాడు. రెవెన్యూ మంత్రిగా వినోబాభావే ప్రారంభించిన భూదానోద్యమానికి చట్టబద్ధత కల్పించాడు. 1948 జనవరిలో ప్రభుత్వ ఏజెంట్ జనరల్గా హైదరాబాద్ వచ్చిన కె.యం. మున్షీని నిజాం ఆజ్ఞలకు విరుద్ధంగా అందరికన్నా ముందే సందర్శించి పాలకుల ఆగ్రహానికి గురయ్యారు. ఆ సంవత్సరంలోనే హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ నాయకుడై ప్రజా ఉద్యమానికి సారథ్యం వహించాడు. హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం కావడానికి కృషి సల్పిన తీరు విశేషమైనది. రాజకీయ రంగంలోనే కాకుండా సాంఘిక సాంస్కృతిక రంగాల్లో వీరు చేపట్టిన సేవ ప్రత్యేకమైనది. ఖాదీ బోర్డు విచారణ సంఘం, మధ్యప్రదేశ్ విషయ పరిశీలన సంఘం, ఆంధ్రప్రదేశ్ భారత్ సేవక సమాజం అధ్యక్షులుగా ఉన్నాడు. చరిత్ర, శాస్త్ర విజ్ఞానాల తెలుగు ఉర్దూ అకాడమీ, భారతీయ విద్యాభవన్, ప్రశాంతి విద్వత్ పరిషత్ అధ్యక్షులుగా గొప్ప సాంస్కృతిక సేవలందించాడు. క్లాసికల్ లాంగ్వేజీ కమిషన్ సభ్యులుగా, దక్షిణ భారత హిందీ ప్రచార సభ, సంస్కృత పరిషత్ల ఉపాధ్యక్షులుగా భాషా సేవలు అందించాడు. 1952లో మొదటిసారి హైదరాబాదు రాష్ట్రానికి ఎన్నికలు జరిగినపుడు, మహబూబ్నగర్ జిల్లాలోని షాద్నగర్ నియోజకవర్గం నుంచి హైదరాబాద్ శాసనసభకు ఎన్నికయ్యాడు. ఆ ఏర్పడిన ప్రజాప్రభుత్వంలో ముఖ్యమంత్రి అయ్యాడు. పూర్తి మెజారిటీ లేకున్ననూ, మంత్రివర్గంలో సంపూర్ణ సహకారం లేకున్ననూ, పరిపాలన దక్షుడైన ముఖ్యమంత్రిగా పేరుగాంచాడు. 1956లో హైదరాబాదు రాష్ట్రంలోని తెలుగు మాట్లాడే ప్రాంతాలను విడదీసి, కోస్తా, రాయలసీమ లతో కలిపి ఆంధ్ర ప్రదేశ్ ఏర్పాటు అయినపుడు, కొత్త రాష్ట్రానికి నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాడు. బూర్గుల, కేరళ రాష్ట్రానికి గవర్నరుగా వెళ్ళాడు. 1960 వరకు కేరళ గవర్నరుగా పనిచేసి, తరువాత 1962 వరకు ఉత్తర ప్రదేశ్ గవర్నరుగా పనిచేసాడు. 1953లో ఆంధ్ర విశ్వవిద్యాలయం అయనకు డాక్టర్ ఆఫ్ లిటరేచర్ గౌరవపట్టాను ప్రదానం చేసింది. 1956లో ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టర్ ఆఫ్ లాస్ అనే పట్టాను ఇచ్చింది. బూర్గుల 1967, సెప్టెంబర్ 14 న గుండెపోటుతో మరణించాడు.

# అస్సాంలో ఆన్ లైన్ స్కామ్

**న్యూస్ డెస్క్ పెన్పవర్ గౌహతి, సెప్టెంబర్ 13:** అస్సాంలో ఆన్లైన్ స్టాక్ ట్రేడింగ్ కుంభకోణం తీవ్ర సంచలనంగా మారింది. పెట్టిన పెట్టుబడిని అతి త్వరలో రెట్టింపు చేస్తామని నమ్మించిన కొందరు మోసగాళ్లు.. ప్రజలను భారీగా స్టాక్మార్కెట్లలో ఇన్వెస్ట్ చేస్తామని చెప్పి కోట్ల రూపాయలను సేకరించారు. 2నెలల్లో పెట్టిన పెట్టుబడిపై 30 శాతం లాభం వస్తుందని చెప్పి.. జనాన్ని నమ్మించారు. ఇక ఈ ఆన్లైన్ స్టాక్ ట్రేడింగ్ కాస్తా.. అస్సాం సినిమా ఇండస్ట్రీలోకి వ్యాపించగా.. ఓ హీరోయిన్, ఆమె భర్తతోపాటు మరికొందరి పేర్లు కూడా ఈ కేసులో బయటికి వచ్చాయి. ఈ కేసులో ప్రధాన సూత్రధారిగా ఉన్న వ్యక్తిని అరెస్ట్ చేసి విచారణ జరపగా.. వీరి పేర్లు బయటికి వచ్చాయి. దీంతో వారిని విచారణకు పిలిచినా రాకపోవడంతో తాజాగా అరెస్ట్ చేశారు. అస్సాం నటి సుమి బోరా, ఆమె భర్త తార్కిక్ బోరాను తాజాగా అస్సాం స్పెషల్ టాస్క్ఫోర్స్ పోలీసులు ఆమెను అరెస్ట్ చేశారు. ఇక ఈ కేసులో ప్రధాన నిందితుడిగా భావిస్తున్న విశాల్ ఫుకాన్ను ఇప్పటికే అరెస్ట్ చేసిన పోలీసులు.. అతడు ఇచ్చిన సమాచారం ఆధారంగానే సుమి బోరా, తార్కిక్ బోరాలు విచారణకు హాజరు కావాలని పోలీసులు నోటీసులు ఇచ్చినా.. వారు స్పందించలేదు.



దీంతో వారిపై కోర్టు లుకౌట్ నోటీసులు జారీ చేయగా.. రంగంలోకి దిగిన పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. ఆన్లైన్ స్టాక్ ట్రేడింగ్లో పెట్టుబడులు పెడితే 60 రోజుల్లో 30 శాతం రాబడి వస్తుందని ప్రజలను నమ్మించి విశాల్ ఫుకాన్ కోట్ల రూపాయలను కూడబెట్టాడు. వాటితో 4 నకిలీ సంస్థలను ప్రారంభించి.. అస్సాం చిత్ర పరిశ్రమలో పెట్టుబడులు పెట్టి భారీగా ఆస్తులను కూడబెట్టాడు. అస్సాంలో ఇటీవల రూ.2 వేల కోట్ల కుంభకోణాన్ని పోలీసులు గుట్టు రట్టు చేశారు. స్టాక్మార్కెట్ ఇన్వెస్ట్మెంట్ల పేరుతో భారీగా డబ్బులు సేకరించినట్లు గుర్తించారు. ఈ క్రమంలోనే అరెస్ట్కు ముందు సుమి బోరా ఓ వీడియోను రిలీజ్ చేశారు. తన పరువుకు నష్టం కలిగించేలా తన కుటుంబంపై వార్తలు వస్తుండటంతో తాను పోలీసుల ముందు లొంగిపోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కేసులో విచారణకు తాను సహకరించాలని అనుకుంటున్నట్లు పేర్కొన్నారు. తాను ఎక్కడికీ పారిపోలేదని.. తాము పరారీలో ఉన్నట్లు మీడియాలో వస్తున్న వార్తలు, తమకు ఎదురైన వేధింపుల కారణంగానే తాము దూరంగా ఉన్నట్లు చెప్పారు. అయితే తాము పారిపోయామని వస్తున్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని ఆ వీడియోలో చెప్పారు. ఈ వీడియో విడుదల చేసిన తర్వాతి రోజే అస్సాం పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకోవడం గమనార్హం. ఇదిలా ఉంటే.. ఈ ఆన్లైన్ స్టాక్ మార్కెట్ స్కామ్ విలువ రూ.22 వేల కోట్లు అని మొదట మీడియాలో రాగా.. ఆ తర్వాత ఆ మొత్తం రూ. 2వేల కోట్లు అని పేర్కొన్నాయి

# వివాదాలు..కేసులతో అవినాష్ రాజకీయ జీవితం

**స్టాఫ్ రిపోర్టర్ పెన్పవర్ విజయవాడ, సెప్టెంబర్ 13:**



రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరు అంటారు. కానీ యువనేత దేవినేని అవినాష్ అధికార టిడిపికి టార్గెట్ కావడం ఆందోళన కలిగిస్తోంది. సుదీర్ఘకాలం ఆయన టిడిపిలోనే ఉన్నారు. ఆయన బంధువులు సైతం అదే పార్టీలో కొనసాగుతున్నారు. ఆయన తండ్రి దేవినేని నెహ్రూ టిడిపి వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరు కావడం గమనార్హం. అయినా సరే.. అవినాష్ కు ఈ పరిస్థితి ఏంటి ? అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. సుదీర్ఘకాలం రాజకీయాలు చేసిన ఆయన సరైన పదవి అందుకోలేదు. ఒక్కసారి కూడా పదవి చేపట్టలేదు. కానీ వివాదాలు, కేసులతో చేజేతులా రాజకీయ జీవితాన్ని నాశనం చేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. కేవలం టిడిపి ప్రభుత్వం దేవినేని అవినాష్ ను టార్గెట్ చేసుకోవడం వెనుక చాలా రకాలుగా ప్రచారం జరుగుతోంది. తెలుగుదేశం పార్టీలో దేవినేని నెహ్రూ చాలా కాలం పని చేశారు. కానీ చంద్రబాబుతో విభేదించి కాంగ్రెస్ పార్టీలో చేరారు. నెహ్రూ వారసుడిగా అవినాష్ కాంగ్రెస్పార్టీ ద్వారా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు. అయితే అవినాష్ ఎంట్రీ, రాష్ట్ర విభజన ఒకేసారి జరగడంతో.. ఆయన సరైన వేదిక లభించలేదు. 2014లో విజయవాడ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. డిపాజిట్లు కూడా దక్కించుకోలేకపోయారు. అటు తరువాత తండ్రి తో కలిసి తెలుగుదేశం పార్టీలోకి ఎంట్రీ ఇచ్చారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు అయ్యారు. 2019లో చంద్రబాబు అవినాష్ పిలిచి మరి గుడివాడ టిక్కెట్ ఇచ్చారు. కానీ అవినాష్ ఓడిపోయారు. వైసీపీ అధికారంలోకి వచ్చేసరికి ఆ పార్టీలోకి ఫిరాయించారు. ఎన్నికల్లో విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. దారుణ పరాజయం చవిచూశారు. అయితే వైసీపీలో ఓడిపోయిన మిగతా నేతలు ప్రశాంతంగా ఉంటే.. అవినాష్ మాత్రం ప్రతిక్షణం అరెస్టుల భయంతో గడుపుతున్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు లోకేష్ టీంలో దేవినేని అవినాష్ ఉండేవారు. కానీ వైసీపీలోకి వచ్చాక అదే లోకేష్ ను టార్గెట్ చేసుకున్నారు. జగన్ ను మెప్పించేందుకు అనరాని మాటలు అన్నారు. ఏ లోకేష్ టీంగా వ్యవహరించారో.. అదే లోకేష్ రెడ్ బుక్ లో చిక్కుకున్నారు అవినాష్. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం పై దాడి కేసులో.. నిందితులంతా అవినాష్ అనుచరులు కావడంతో ఇబ్బందుల్లో పడ్డారు. ప్రస్తుతం ఈ కేసులో ముందస్తు బెయిల్ దక్కకపోవడంతో అజ్ఞాతంలో గడపాల్సిన అనివార్య పరిస్థితి ఆయనకు ఎదురైంది. దాదాపు పది సంవత్సరాల్లో మూడు పార్టీలు తిరిగారు. ప్రతి చోట ఓటమి ఎదురైంది. గెలుపు దక్కే సమయంలో ప్రత్యర్థి పార్టీలో చేరారు. రాజకీయ మనుగడ కోసం ప్రత్యర్థులపై వ్యక్తిగతంగా విరుచుకుపడేవారు. అదే రాజకీయంగా వారికి ఇబ్బంది పెట్టింది. నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది అంటారు. కానీ అవినాష్ అలా కాదు. అలా ఉండలేకపోయారు కూడా. పొలిటికల్ నిర్ణయాల విషయంలో తప్పటడుగులు వేశారు. వరుసగా తప్పులు చేశారు. దానికి ఇప్పుడు మూల్యం చెల్లించుకుంటున్నారు. ఏ వైసీపీనేతలకు లేని ఇబ్బందులను తనకు తాను తెచ్చుకున్నారు. మరి వాటి నుంచి ఎలా బయటపడతారో చూడాలి.

## పాడి కౌశిక్ రెడ్డిపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌కు కాంగ్రెస్ మహిళా నాయకుల ఫిర్యాదు

### కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలకు చీర, గాజులు పంపిస్తానన్న కౌశిక్ రెడ్డి

### కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలపై మహిళా కాంగ్రెస్ నేతల ఆగ్రహం

### పాడి కౌశిక్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



**హైదరాబాద్ పెన్ పవర్:**బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై అనర్హత వేటు వేయాలని కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకులు మధ్యాహ్నం స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌లోని మంత్రుల నివాస ప్రాంగణంలో వారు స్పీకర్‌ను కలిశారు. కౌశిక్ రెడ్డి మహిళల పట్ల అసభ్యకరంగా మాట్లాడారని మండిపడ్డారు. ఆయనపై చర్యలు తీసుకోవాల్సిందేనని అన్నారు. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలకు చీర, గాజులు పంపుతున్నానంటూ కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ మహిళా నాయకులు మండిపడుతున్నారు. బీఆర్ఎస్ నాయకులు... మహిళలను కించపరచడం మానుకోవాలని హెచ్చరించారు.


## గాంధీ ఇంట్లోకి చొచ్చుకెళ్లేందుకు BRS నేతల ప్రయత్నం.. ఎమ్మెల్యే ఇంటి వద్ద హైటెన్షన్




**హైదరాబాద్ పెన్ పవర్:**శేరిలింగపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఇంటి వద్ద తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అధిష్టానం పిలుపు మేరకు పెద్ద ఎత్తున అరికెపూడి గాంధీ ఇంటి వద్దకు చేరుకున్న బీఆర్ఎస్ శ్రేణులు.. ఒక్కసారిగా ఎమ్మెల్యే ఇంట్లోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. పక్కనే ఉన్న పోలీసులు వెంటనే అప్రమత్తమై బీఆర్ఎస్ కార్యకర్తలను అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, బీఆర్ఎస్ నేతలకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఎమ్మెల్యే గాంధీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు బీఆర్ఎస్ నేతలు నినాదాలు హోరెత్తించారు. ఈ క్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. వెంటనే అలర్ట్ అయిన పోలీసులు బీఆర్ఎస్ కార్యకర్తలను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఓ వైపు భారీ పోలీస్ బందోబస్తు.. మరోవైపు కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల పోటాపోటీ ఆందోళనలతో ఎమ్మెల్యే గాంధీ ఇంటి వద్ద హైటెన్షన్ వాతావరణం నెలకొంది. కాగా, పీఏసీ చైర్మన్ వ్యవహారంలో ఎమ్మెల్యే గాంధీ, పాడి కౌశిక్ రెడ్డి మధ్య మాటల యుద్ధం నడుస్తోన్న విషయం తెలిసిందే. నీ ఇంటికి వస్తా అంటే నీ ఇంటికే నేను వస్తా అంటూ ఇరువురు సవాళ్లు విసురుకుని రాష్ట్ర రాజకీయాన్ని వేడెక్కించారు. చెప్పినట్లుగానే గురువారం ఎమ్మెల్యే గాంధీ అనుచరులతో కలిసి కౌశిక్ రెడ్డికి ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలోనే గాంధీ అనుచరులు, అభిమానులు కౌశిక్ రెడ్డిపై ఇంటిపై దాడి చేశారు. ఈ దాడికి నిరసనగా ఇవాళ (సెప్టెంబర్ 17) ఎమ్మెల్యే గాంధీ ఇంటిని ముట్టడించాలని కేడర్ కు బీఆర్ఎస్ హై కమాండ్ పిలుపునిచ్చింది. దీంతో ఇవాళ పెద్ద ఎత్తున గులాబీ శ్రేణులు ఎమ్మెల్యే గాంధీ ఇంటి వద్దకు వెళ్లేందుకు ప్రయత్నం చేయడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

## కోల్‌కతా వైద్యురాలిపై హత్యాచారం కేసులో కీలక పరిణామం

- నిందితుడు సంజయ్ రాయ్‌కి నార్కో అనాలిసిస్ టెస్ట్ చేయనున్న సీబీఐ
- అనుమతి ఇచ్చిన కోల్‌కతాలోని సీల్దా కోర్టు
- పాలిగ్రాఫ్ టెస్టులో నిందితుడు చెప్పిన విషయాలను క్రాస్ చెక్ చేయనున్న దర్యాప్తు సంస్థ





**హైదరాబాద్ పెన్ పవర్:**కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ-హాస్పిటల్ ట్రైనీ వైద్యురాలిపై హత్యాచారం కేసులో ఇవాళ (శుక్రవారం) కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్‌కి నార్కో అనాలిసిస్ టెస్ట్ చేసేందుకు సీబీఐకి కోర్టు అనుమతి దక్కింది. నిందితుడు సంజయ్ రాయ్ కొన్ని వాస్తవాలను దాస్తున్నాడని, పాలిగ్రాఫ్ టెస్టులో ఈ విషయం ప్రతిబింబించిం దని సీబీఐ వర్గాలు చెబుతున్నాయి. అందుకే నార్కో అనాలిసిస్ టెస్ట్ చేయాలనుకుంటున్నామని, ఈ మేరకు అనుమతి ఇవ్వాలంటూ కోల్‌కతాలోని సీల్దా కోర్టును ఇవాళ ఉదయం సీబీఐ కోరింది. అభ్యర్థనను పరిశీలించిన న్యాయస్థానం నార్కో అనాలిసిస్ టెస్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సంజయ్ రాయ్‌తో సీల్దా కోర్టు న్యాయమూర్తి మాట్లాడిన అనంతరం ఈ మేరకు అనుమతి ఇచ్చారు.

ఈ కేసులో నిందితుడిగా ఉన్న సంజయ్ రాయ్ నిజం చెబుతున్నాడో లేదో క్రాస్-చెక్ చేయడానికి నార్కో అనాలిసిస్ టెస్ట్ చేయాలనుకున్నామని సీబీఐ అధికారి ఒకరు పేర్కొన్నారు. అతడు చెప్పే విషయాలను ధృవీకరించడానికి నార్కో పరీక్ష తమకు సాయపడుతుందని సదరు అధికారి తెలిపారు. నార్కో అనాలిసిస్ టెస్ట్‌లో సోడియం పెంటోథాల్ అనే డ్రగ్‌ను వ్యక్తి శరీరంలోకి ఇంజెక్ట్ చేస్తారని, మైకం కలిగించే స్థితికి తీసుకెళ్లి ఆలోచనలను తటస్థీకరిస్తారని సీబీఐ అధికారి ఒకరు చెప్పారు. నార్కో అనాలిసిస్ టెస్టులు జరిపిన ఎక్కువ సందర్భాల్లో నిందితులు అసలై సమాచారాన్ని ఇస్తారని తెలిపారు.

## పన్ను చెల్లించాలని నోటీసులు... 30 వేల మంది టీసీఎస్ ఉద్యోగులకు ఐటీ శాఖ షాక్

- టీడీఎస్‌లో వ్యత్యాసాల కారణంగా నోటీసులు
- సీనియరిటీని బట్టి రూ.1 లక్ష వరకు పన్ను డిమాండ్ నోటీసు
- సాఫ్ట్‌వేర్‌లో పొరపాటు కారణంగా నోటీసులు?
- అప్పుడే చెల్లింపులు చేయవద్దని ఉద్యోగులకు టీసీఎస్ సూచన




**హైదరాబాద్ పెన్ పవర్:**వేలాదిమంది టీసీఎస్ ఉద్యోగులకు ఆదాయపు పన్ను శాఖ షాకిచ్చింది. 30 వేల నుంచి 40 వేల మంది ఉద్యోగులకు ఐటీ శాఖ... పన్ను డిమాండ్ నోటీసులను పంపించింది. టీడీఎస్ విషయంలో వ్యత్యాసాల కారణంగా ఈ నోటీసులు పంపింది. కంపెనీలో ఉద్యోగి సీనియారిటీని బట్టి రూ.50 వేల నుంచి రూ.1 లక్ష వరకు పన్ను చెల్లించాలని ఆదాయపు పన్ను శాఖ అందులో పేర్కొంది. ఈ మేరకు మీడియాలో కథనాలు వచ్చాయి.

**కారణం అదేనా?**

సాఫ్ట్‌వేర్‌లో పొరపాటు కారణంగా టీడీఎస్‌కు సంబంధించిన వివరాలు ఆదాయపు పన్ను శాఖ పోర్టల్‌లో సరిగ్గా అప్ డేట్ కాకపోవడమే ఈ పరిస్థితికి కారణమని చెబుతున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి పన్ను చెల్లింపుదారులు చెల్లించిన టీడీఎస్‌కు ఎలాంటి రికార్డులు లేకపోవడంతో ఐటీ చట్టం సెక్షన్ 143(1)కి లోబడి సెప్టెంబర్ 9న ఐటీ శాఖ నోటీసులు జారీ చేసింది.

**చెల్లింపులు జరపవద్దని ఉద్యోగులకు టీసీఎస్ సూచన**

ఐటీ శాఖ నోటీసులపై టీసీఎస్ స్పందించింది. ఈ నోటీసులకు స్పందించి ఎలాంటి చెల్లింపులు జరపవద్దని ఉద్యోగులకు అంతర్గతంగా సమాచారం ఇచ్చింది.

సంస్థ నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు చెల్లింపులు చేయవద్దని పేర్కొంది. ఈ అంశానికి సంబంధించి ఆదాయపు పన్ను శాఖ అధికారులతో చర్చిస్తున్నామని తెలిపింది. త్వరలో సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేసింది.